క్లుప్తంగా

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న బ్రహ్మకుమారి గాయత్రి

అమలాపురం టౌన్: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత వ్యక్తిత్వ వికాసానానికి నిదర్శనం కావాలని బ్రహ్మకుమారి గాయత్రి అన్నారు. స్థానిక రవితేజ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉన్నత విలువలపై గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో గాయత్రి మాట్లాడారు. పెద్దలను ముఖ్యంగా వృద్ధులు, తల్లిదండ్రులు, గురువుల పట్ల విధేయత, కృతజ్ఞతతో మెలగాలని సూచించారు. స్మార్ట్ ఫోన్లను దూరం పెట్టి చదువుపై శ్రద్ధచూపాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటామని విద్యార్థుల చేత బ్రహ్మకుమారి ప్రతిజ్ఞ చేయించారు. శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, ప్రిన్సిపాల్ కె.దొరబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి విరాళం



శ్మశాన వాటిక అభివృద్ధికి విరాళం అందజేస్తున్న అగ్నికుల క్షత్రియ సంఘం నాయకులు

ఐ.పోలవరం: గుత్తినదీవి, జి.వేమవరం గ్రామాలకు సంబంధించిన శ్మశాన వాటిక అభివృద్ధికి గుత్తినదీవి జగ్గంపేట అగ్నికుల క్షత్రియ సంఘం రూ.లక్ష విరాళంగా గురువారం అందించింది. అగ్నికుల క్షత్రియ సంఘం గ్రామస్తులంతా మానవతా దృక్పథంతో శ్మశాన వాటికకు తమ వంతు సహాయాన్ని అందించారు. వారికి శ్మశాన వాటిక అభివృద్ధి కమిటీ ప్రతినిధులు అభినందలు తెలిపారు.

సచివాలయం ఉద్యోగులకు సత్కారం

అమలాపురం రూరల్: ఇమ్మిడివరప్పాడు, తాండవపల్లి సచివాలయంలో విధులు నిర్వర్తిస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన సచివాలయం ఉద్యోగులు, కొత్తగా విధుల్లో చేరిన ఉద్యోగులను సర్పంచ్ రేలంగి దుర్గారావు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. గతంలో పంచాయతీ కార్యదర్శులు పనిచేసిన రెడ్డి శిరీష,. ఆర్.సుజాత, కార్యదర్శి విజయదుర్గ, ఎంఎల్‌హెచ్‌పీ శివరాణిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీను బాబు, పాలకవర్గ సభ్యులు వి.సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ఆర్. రమ్య, శ్రీనివాస్, గ్రామ పెద్దలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్పీగా వరదరాజన్ నియామకం

యానాం: కేంద్రపాలిత ప్రాంతమైన యానాం ఎస్పీగా కె వరదరాజన్‌ను నియమిస్తూ గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శరత్ చౌహాన్ ఆదేశాలు జారీ చేసారు. ఇటీవల యానాం తాత్కాలికంగా ఎస్పీగా నియమితులైన చింతా కోదండరామ్‌ను పీఏపీ కమాండెంట్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (స్పెషల్ బ్రాంచ్) పుదుచ్చేరిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పుదుచ్చేరి వ్యాప్తంగా 14 మంది ఎస్పీలకు స్థానచలనం కలిగింది.

ఉత్సాహంగా 'పొలంబడి'

తాళ్లరేవు: మండల పరిధిలోని పి.మల్లవరం పంచాయతీలో రైతు దడాల సత్తికొండ పొలం వద్ద వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులందరికీ ఏ సమయంలో మందులు ఉపయోగించాలి, ఏ మోతాదులో ఎరువులు వేయాలి తదితర విషయాలను ఏఓ ప్రశాంతి వివరించారు. పంటల సాగులో రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించి, ప్రకృతి సిద్ధమైన కషాయాలు వినియోగించాలని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనీ ధనలక్ష్మి వివరించారు, ఈ కార్యక్రమంలో విళ్ల సత్యనారాయణ, ధూళిపూడి వెంకటరమణ, దడాల బుజ్జిబాబు, వీఏఏలు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

అంబాజీపేట: ఎగువున కురిసిన భారీ వర్షాల కారణంగా వైనతేయి నది ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో మండలంలోని వరద ముంపు ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ చినబాబు సూచించారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో మండల, గ్రామస్థాయి అధికారులతో సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ, గంగలకుర్రు అగ్రహారం, నందంపూడి, మాచవరం, తొండవరం, వాకలగరవు ప్రాంతాలను ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించాలన్నారు. పల్లపు ప్రాంతాల్లో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ నరసింహం, వీఆర్వోలు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని విస్మరించిన కూటమి

- తెరుచుకోని ఏపీ ప్రభుత్వ వెబ్‌సైట్లు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- విలవిల్లాడుతున్న పేద ప్రజలు



గ్రామ సచివాలయం

ముమ్మిడివరం: ప్రజా సంక్షేమ పథకాలకు కూటమి ప్రభుత్వం మంగళం పాడుతుందా అనే అనుమానం కలిగేలా పాలన సాగుతోందని ప్రజలు వాపోతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలకు కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. వివిధ పథకాలకు అర్హులు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వ వెబ్‌సైట్లు తెరుచుకోవడం లేదు.

సచివాలయాల చుట్టూ ప్రదక్షిణ

2024లో ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల సంఘం తాత్కాలికంగా ప్రభుత్వ వెబ్‌సైట్లను మూసి వేసింది. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది దాటినా ప్రభుత్వ సైట్లను తెరవడంలేదు. వెబ్‌సైట్లు తెరవకపోవడంతో వివిధ పథకాల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు నిరుత్సాహానికి గురువుతున్నారు. ప్రభుత్వ సైట్లు తెరవకపోవడంతో వివిధ రకాల సేవలు, పథకాల కోసం దరఖాస్తులను అప్‌లోడ్ చేయలేకపోతున్నామని సచివాలయ ఉద్యోగులు అంటున్నారు. గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను అమలులోకి తెచ్చి దాదాపు 500 సేవలను సచివాలయ ద్వారా అమలు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్లను పక్కన పెట్టింది. ఎన్నికల హామీలో భాగంగా వలంటీర్లకు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు గౌరవ వేతనం పెంచుతామంటూ అధికారంలోకి వచ్చిన తరువాత పెంచకపోవడంతో లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలు, సేవల కోసం సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

కొత్త పింఛన్లు ఎప్పుడో ?

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఏటా జనవరి, జూలై నెలల్లో కొత్త పింఛన్లు మంజూరు చేసేది. 2024 ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తరువాత సైట్ మూతపడింది. ప్రభుత్వ సైట్లు మూసివేసే సమయానికి దరఖాస్తు చేసుకున్న పింఛన్లకు ఇప్పటి వరకు మోక్షం లభించకపోగా వెబ్‌సైట్లు ఓపెన్ చేయలేకపోవడంతో కొత్త వాటికి దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుండా పోయింది. రేషన్ కార్డుల విషయంలో కూడా ప్రభుత్వం పిల్లి మొగ్గలు వేస్తోంది. గత ప్రభుత్వంలో సాధారణంగా చనిపోతే రూ.లక్ష, ప్రమాదంలో చనిపోయిన వారికి రూ.5 లక్షలు వైఎస్సార్ బీమా కింద ఆర్థిక సాయం అందించేవారు. ఈ ఏడాది జూన్ 30కి గడువు ముగిసింది. కూటమి ప్రభుత్వం వెబ్ సైటు ఓపెన్ చేయకపోవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు.

కూటమి హామీలు గాలికి

ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డుల పరిస్థితి కూడా అలాగే ఉందని, వెబ్‌సైట్‌లోని పలు ఆప్షన్లు పనిచేయడం లేదని పలువురు వాపోతున్నారు. గత ప్రభుత్వం పేద కుటుంబాలను ఆదుకోవడానికి వివాహ ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించింది. బీసీ కులాలకు రూ.50 వేలు, వధూవరుల్లో ఎవరైనా వికలాంగుల ఉంటే వారికి రూ.75వేలు, ఎస్సీ సామాజిక వర్గానికి రూ.లక్ష, వారిలో ఒకరు వికలాంగులైతే రూ.15 లక్షలు బీసీ, ఎస్సీ వర్గాల్లో కులాంతర వివాహం చేసుకుంటే రూ.1.20 లక్షలు చొప్పున ఆర్థిక సాయం అందించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని రెండింతలు చేస్తామని ఇచ్చిన హామీ గాలికి వదిలేసింది. గత ప్రభుత్వంలో ప్రజలు పొందిన అనేక సంక్షేమ పథకాలకు కూటమి ప్రభుత్వం నీరు గార్చే ప్రయత్నాలు చేయడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంకెన్నాళ్లో ఎదురుచూపులు



కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటింది. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకపోగా గత ప్రభుత్వ పథకాల అమలుకు కూడా మోకాలడ్డుతోంది. రెండేళ్లుగా కొత్త పింఛన్లు మంజూరు కాక అనేక మంది వృద్ధులు, వితంతువులు ఇబ్బంది పడుతున్నారు.

– రేకాడి వర్మ, ముమ్మిడివరం

ప్రభుత్వ వెబ్‌సైట్లను తెరవాలి



ఎన్నికలకు ముందు మూసి వేసిన పలు ప్రభుత్వ వెబ్‌సైట్లను తెరవాలి. సైట్లను మూసి వేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా పింఛన్లు కోసం దరఖాస్తులు చేయడానికి వెబ్‌సైటు పనిచేయడం లేదని సచివాలయ ఉద్యోగులు చెపుతున్నారు.

– కాత్రు అప్పారావు, అయినాపురం

పెరిగిన వరద ఉధృతి

ఐ.పోలవరం: గౌతమీ, వృద్ధ గౌతమీలు ప్రమాదకర స్థితిలో సుడులు తిరుగుతూ ప్రవహిస్తున్నాయి. ఐ.పోలవరం మండలంలో వరద ఉధృతి అధికంగా ఉంది. అన్నంపల్లి అక్విడెక్టు సగం వరకు మునిగింది. అక్విడెక్టుకు ఇరువైపులా ఇటు పశువుల లంక, అటు ముమ్మిడివరం మండలం అన్నంపల్లి వైపు ఏటిగట్లు బలహీనంగా ఉండడంతో వరద ఉధృతి పెరగడంతో ఈ ప్రాంత వాసులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలో మురమళ్ల రాఘవేంద్ర వారధి వద్ద ఉన్న మత్స్యకార కాలనీ రాత్రికి ముంపుబారిన పడే అవకాశముంది. జి.మూలపొలం, గుత్తెనదీవి, ఎదుర్లంకలో ఏటిగట్టు దిగువున ఉన్న గృహాలు ముంపులో చిక్కుకోనున్నాయి. మురమళ్లలో వరద నీరు డ్రెయిన్ ద్వారా చొచ్చుకు వచ్చి చేలను ముంచిన విషయం తెలిసిందే.

మత్స్యకార కాలనీలోకి వరద నీరు

అల్లవరం: ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు గోదావరి, దాని ఉప నదులు పొంగి ప్రవహిస్తున్న నేపథ్యంలో అల్లవరం మండలం బోడసకుర్రు జాతీయ రహదారి వద్ద వైనతేయ గురువారం ఉధృతంగా ప్రవహిస్తోంది. వరద నీరు భారీగా దిగువకు రావడంతో బోడసకుర్రు వద్ద మత్స్యకార కాలనీ వరద పోటు తగలింది. దీంతో మత్స్యకార కాలనీలోకి వరద నీరు చేరింది. వరద కారణంగా మత్స్యకారులకు చెందిన 40 ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. ధవళేశ్వరం వద్ద ఒకటో ప్రమాద హెచ్చరిక చేసిన నేపథ్యంలో వరద మరింత ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉందని అధికారులు వరద బాధితులకు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి వరద ప్రభావిత ప్రాంతంలో గురువారం సందర్శించారు. వరద ముంపు ప్రాంతాల్లో డిప్యూటీ ఎంపీడీఓ నాగేంద్ర ఆధ్వర్యంలో శానిటేషన్ పనులు నిర్వహించారు. కార్యదర్శి ఆదిశంకరం, గ్రేడ్‌–5 కార్యదర్శి బాబ్జి తదితరులు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తాళ్లరేవు: గోదావరికి వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో లంక గ్రామాలు, లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. గురువారం మండల అధికారులు తహసీల్దార్ పితాని త్రినాథరావు, ఎంపీడీఓ కె.సత్యన్నారాయణ తదితరులు పిల్లంక పంచాయతీ కొత్తలంక, ఇంజరం పంచాయతీ అరటికాయలంకలో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. సహాయక చర్యలపై స్థానిక నాయకులు, అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గోదావరి నదికి రెండవ ప్రమాద హెచ్చరిక జారీచేసిన నేపథ్యంలో నదీ పరీవాహక ప్రాంతాలు, ప్రమాద ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను, సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల డీసీ చైర్మన్ వేగేశ్న భాస్కరరాజు, నాయకులు ఆకెళ్ల నాగేశ్వరరావు, రేలంగి బాబి పాల్గొన్నారు.



మురమళ్ల రాఘవేంద్ర వారధి వద్ద మత్స్యకార ప్రాంతాన్ని తాకుతూ ప్రవహిస్తున్న వరద



పిల్లంక పంచాయతీ కొత్తలంక వంతెన వద్ద వరద పరిస్థితిని పరిశీలిస్తున్న అధికారుల బృందం



బోడసకుర్రు పల్లిపాలెంలో మత్స్యకార కాలనీలోకి చేరిన వరద నీరు



అన్నంపల్లి అక్విడెక్టును తాకుతూ ప్రవహిస్తున్న వరద నీరు

యానాం: గౌతమీ గోదావరి వరద ప్రవాహం పెరుగుతుండటంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసినట్లు ఆర్ఏఓ మునిస్వామి తెలిపారు. గురువారం ఆయన లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. జీసెస్ స్టాట్యూ వద్ద గోదావరి నీటి మట్టాన్ని ఆయన పరిశీలించి పీడబ్ల్యూడీ అధికారులతో ముందస్తు చర్యలపై చర్చించారు.

కాకినాడ జిల్లాకు నాయకర్ పేరు పెట్టాలి

తాళ్లరేవు: కాకినాడ జిల్లాకు విద్యాదాత మల్లాడి సత్యలింగం నాయకర్ పేరు పెట్టాలని కోరుతూ జిల్లా ఐక్య మహా సమితి ప్రతినిధులు తహసీల్దార్ పితాని త్రినాథరావుకు వినతిపత్రం అందజేశారు. సత్యలింగం నాయకర్ కోరంగి గ్రామంలో జన్మించి, రంగూన్ వెళ్లి ఓడరేవుల్లో రవాణా వ్యాపారం చేసి ఎంతో ఆస్తిని సంపాదించారని పేర్కొన్నారు. 1912లో ఎంఎస్ఎన్ చారిటీస్ సంస్థను ఏర్పాటు చేసి తన యావదాస్తిని విద్యా సంస్థలకు, దేవాలయాలకు ధారాదత్తం చేసిన మహాదాత అని అన్నారు. ఆ సంస్థ ద్వారా విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత విద్య, పేద విద్యార్థులకు ఉచిత భోజన వసతి, అలాగే వేద పాఠశాల నిర్వహణ వంటి ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. ఆయన సేవలను గుర్తించి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును కూడా అందజేసినట్లు తెలిపారు. అటువంటి మహనీయుని చరిత్ర భావితరాలకు తెలిసే విధంగా ఆయన పేరును కాకినాడ జిల్లాకు పెట్టాలని శ్రీమల్లాడి సత్యలింగం నాయకర్ జిల్లా ఐక్య మహాసమితి అధ్యక్షుడు వైదాడి నూకరాజు, కామాడి మాతరాజు, అంగాడి తాతారావు, రత్స ముత్యాలు, కొల్లు శ్రీను, పి.నాగేషు తదితరులు కోరారు.



తాళ్లరేవు తహసీల్దార్ త్రినాథరావుకు వినతిపత్రం అందజేస్తున్న జిల్లా ఐక్య మహా సమితి ప్రతినిధులు

గణపతి ఉత్సవాలకు అనుమతి తీసుకోవాలి

ఉప్పలగుప్తం: వినాయక చవితి ఉత్సవాల నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్సై సీహెచ్ రాజేష్ సూచించారు. ప్రభుత్వం అమలులోకి తీసుకునివచ్చిన సింగిల్ విండో పద్ధతితో గణపతి ఉత్సవ మందిరాలకు అనుమతులు పొందవచ్చని ఎస్సై సూచించారు. గొల్లవిల్లి భీమేశ్వర ఆడిటోరియంలో ఆయా గ్రామాల గణపతి ఉత్సవ కమిటీ సభ్యులతో గురువారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. గణేష్ ఉత్సవ్ డాట్ నెట్ వెబ్‌సైట్‌లో ఒక్క క్లిక్‌తో సులభంగా అనుమతులు పొందవచ్చని ఆయన సూచించారు.

అమలాపురం రూరల్: శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గణేష్ ఉత్సవాలు, నిమజ్జనాలు నిర్వహించేందుకు ముందుగా పోలీసుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని అమలాపురం తాలూకా ఎస్సై శేఖర్ బాబు సూచించారు. అమలాపురం రూరల్ మండలం తాండవపల్లిలో గురువారం గణేష్ ఉత్సవాలపై ముందస్తుగా గ్రామస్తులు, కమిటీ సభ్యులకు ఎస్సై శేఖర్ బాబు అవగాహన కల్పించారు. ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్ష

యానాం: పుదుచ్చేరి మంత్రివర్గంలో ఇటీవలి మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన జాన్‌కుమార్‌తో గురువారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ సమావేశమయ్యారు. ఈసందర్భంగా నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వేగవంతం చేయడం తదితర అంశాలను చర్చించారు. జీఓ 5ను రద్దు చేయడమో, సవరించడమో చేయాలని ఎమ్మెల్యే అశోక్ కోరారు.

21న వీఏఓ రాతపరీక్ష

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా రెవెన్యూ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శాఖలో ఖాళీగా ఉన్న విలేజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(వీఏఓ) ఉద్యోగాలకు రాత పరీక్షను సెప్టెంబర్ 21న ఆదివారం నిర్వహిస్తున్నట్లు డీపీఅండ్ఏఆర్ అండర్ సెక్రటరీ జయశంకర్ గురువారం తెలిపారు. పుదుచ్చేరి, యానాం, కారైకల్, మాహే రీజియన్లలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హాల్‌టికెట్ల విడుదల, పరీక్ష కేంద్రాల జాబితా వివరాలను త్వరలోనే తెలియజేస్తామన్నారు.

కాలుష్యానికి చరమగీతం పాడుదాం

అంబాజీపేట: నేటి సమాజంలో కాలుష్యానికి ప్రధాన కారణమైన ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించి ప్రతి ఒక్కరూ చరమగీతం పాడాలని డిప్యూటీ ఎంపీడీఓ కె.శ్రీనివాస్ అన్నారు. పుల్లేటికుర్రులో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం సర్పంచ్ జల్లి బాలరాజు అధ్యక్షతన గురువారం జరిగింది. శ్రీనివాస్ మాట్లాడుతూ, రోజురోజుకీ కాలుష్యం పెరిగిపోతుందని, దీనిని అరికట్టడం అందరి బాధ్యత అన్నారు. హోటల్స్‌లో వినియోగిస్తున్న ప్లాస్టిక్ పేపరు వల్ల క్యాన్సర్, అనారోగ్యం భారీన పడుతున్నారని వివరించారు. గ్రామంలో ఉన్న హోటల్స్, స్వీట్‌స్టాల్స్, చాట్ బళ్లు, మాంస విక్రయదారులు కిరాణా, ఫ్యాన్సీ షాపుల యజమానులకు, వినియోగదారులకు ప్లాస్టిక్ వల్ల ప్రబలే రోగాలను వివరించారు. గ్రామంలో శానిటేషన్ చేపట్టి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వి.లక్ష్మీపతి, ఆరోగ్య సిబ్బంది పి.ఏసుబాబు, ఏపీహెచ్ఏ షైనా, ఎంఎల్‌హెచ్‌పీ అరుణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై పనిభారం తగదు

ముమ్మిడివరం: అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో విద్యాశక్తి కార్యక్రమాన్ని ఫ్యాప్టో పక్షాన బహిష్కరిస్తున్నట్లు ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఎంటీవీ సుబ్బారావు, సెక్రటరీ జనరల్ పోతంశెట్టి దొరబాబు తెలిపారు. ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ నిర్వహిస్తున్న విద్యాశక్తి కార్యక్రమం స్వచ్ఛందంగా చేయాలని విధివిధానాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్బంధంగా చేయాలని ఉపాధ్యాయులపై కొంతమంది అధికారులు, ప్రధానోపాధ్యాయులు ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే టెస్ట్ విద్యార్థులకు ప్రతిరోజు సాయంత్రం అదనపు తరగతులను ఉపాధ్యాయులు నిర్వహిస్తున్నారని, పాఠశాలలో బోధనేతర విద్యాబోధన ఉపాధ్యాయులు మరింత భారంగా ఉందన్నారు. 6నుంచి9 తరగతులకు విద్యాశక్తి కార్యక్రమాన్ని నిర్వహించడాన్ని ఫ్యాప్టో పక్షాన బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. దీనిపై జిల్లా విద్యాశాఖ, అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ వినతిపత్రం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెంకే వెంకటేశ్వరరావు, సరిదే సత్యపల్లం రాజు, ఎంఎస్ మునేశ్వరరావు, జివి.రమణ, మురుగేశ్వరరావు పాల్గొన్నారు.

వీరేశ్వర అన్నదాన ట్రస్ట్‌కు విరాళం

ఐ.పోలవరం: మురమళ్ల శ్రీ వీరేశ్వర అన్నదాన ట్రస్టుకు గురువారం భక్తుడు విరాళం అందించారు. కొవ్వూరుకు చెందిన కాకిరాల శ్రీనివాసరావు రూ.పది వేలు విరాళమిచ్చారు. దాతలకు ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామి చిత్రపటం, శేష వస్త్రం, ప్రసాదం అందించి సత్కరించారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌గా రామగణేష్‌కు పదోన్నతి

అల్లవరం: స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న జి.రామగణేష్ సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. కలెక్టర్ మహేష్‌కుమార్ గురువారం విడుదల చేసిన రెవెన్యూ ఉద్యోగులు బదిలీల్లో గణేష్‌కు అవకాశం దక్కింది. ప్రస్తుతం పని చేస్తున్న అల్లవరం తహసీల్దార్ కార్యాలయంలోనే సీనియర్ అసిస్టెంట్‌గా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావుకు జాయినింగ్ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా కార్యాలయం సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్మాణ దశలో ఉన్న పీఎంశ్రీ భవనాన్ని సర్వ శిక్షా అభియాన్ ఏపీసీ జి.మమ్మి గురువారం పరిశీలించారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్ఈవో సత్తి సత్యకృష్ణ, ఉపాధ్యాయులు యాళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: తాతాగునీటి చెరువుల అభివృద్ధి, భూగర్భ జలాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. పథకాల అమలులో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని సూచించారు. గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వివిధ జిల్లాల కలెక్టర్లు, జేసీలతో అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ, నిర్ణీత గడువు నాటికి కేపీఐ పనితీరు నివేదికలను ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. నరేగా ద్వారా భూగర్భ జలాల పెంపునకు చర్యలు చేపట్టాలన్నారు. ఏపీపీ, ఏజీపీ, జీపీ పోస్టుల్లో అర్హులైన అడ్వకేట్లను ఎంపిక చేసి, ఖాళీలను జిల్లా జడ్జిల సమన్వయంతో రెవెన్యూ అధికారులు ఆయా పోస్టుల్లో ఇన్‌చార్జిలను నియమించాలన్నారు. జేసీ టి.నిషాంతి, డీపీవో శాంతిలక్ష్మి, డీఎస్‌వో ఏ.ఉదయభాస్కర్, భూగర్భ గనుల శాఖ ఏడీ ఎల్.వంశీధర్ రెడ్డి, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ బి.రాజేశ్వరి, మున్సిపల్ కమిషనర్లు రంగారావు, నిర్మల్‌కుమార్, రవివర్మ తదితరులు పాల్గొన్నారు

జూట్ సంచులు వాడాలి: జేసీ

రైతుబజార్లలో ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా జూట్ సంచులు వినియోగించాలని జాయింట్ కలెక్టర్ నిషాంతి తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతినడమే కాకుండా, భూగర్భ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. రైతులు వినియోగదారులకు ప్లాస్టిక్ సంచుల నివారణకు విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. రైతు బజార్లలో పరిసరాల పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖాధికారులను ఆదేశించారు.

బయో మెడికల్ వ్యర్థాలను మున్సిపల్ చెత్తతో కలపొద్దు

అమలాపురం టౌన్: బయో–మెడికల్ వ్యర్థాల నిర్వహణపై మార్గదర్శకాలను ఆస్పత్రులు, డయోగ్నస్టిక్ ల్యాబ్‌లు సిబ్బంది కచ్చితంగా పాటించాలని మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ సూచించారు. పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రులు, డయోగ్నస్టిక్ సెంటర్ల నిర్వాహకులతో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో కమిషనర్ నిర్మల్‌కుమార్ మాట్లాడారు. 2016 చట్ట ప్రకారం బయో– మెడికల్ వ్యర్థాలను ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన ఏజెన్సీలకు మాత్రమే అందజేయాలని కమిషనర్ సూచించారు. మున్సిపల్ వ్యర్థాలతో కలిపి బయో – మెడికల్ వ్యర్థాలను పారిశుద్ధ్య సిబ్బందికి అందజేస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. పట్టణంలోని అన్ని ఆస్పత్రులు, ల్యాబ్‌లు విధిగా ట్రేడ్ లైసెన్స్‌లు కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఆస్పత్రుల వైద్యులు తమ చర్యలకు సహకరించాలని కోరారు. ఆస్పత్రుల సిబ్బంది, ల్యాబ్‌ల ప్రతినిధులతో పాటు వార్డు సచివాలయాల ఎన్విరాల్‌మెంట్ సెక్రటరీలు పాల్గొన్నారు.



ఆస్పత్రులు, ల్యాబ్‌ల సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్

అంగన్‌వాడీ సిబ్బంది ధర్నా

అమలాపురం రూరల్: అఖిల భారత అంగన్‌వాడీ యూనియన్ పిలుపు మేరకు ఏపీ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల యూనియన్ ఆధ్వర్యంలో అమలాపురం ప్రాజెక్ట్ పరిధిలో మూడు మండలాల పరిధిలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అమలాపురం తాహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ అశోక్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. అంగన్‌వాడీ వర్కర్లకు సంబంధించి న్యాయమైన డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని కోరారు. అంగన్‌వాడీ నాయకురాలు అమూల్య, దుర్గ మాట్లాడుతూ వేతనాలు పెంచాలని,ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని కోరారు. నెట్ సిగ్నలేకపోవడం, సర్వర్లు పనిచేయకపోవడంతో లబ్ధిదారులందరూ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. యాప్‌ల సంఖ్యను కుదించాలని కోరారు.



తహసీల్దార్ అశోక్‌ప్రసాద్‌కు వినితిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

వేతనాలు పెంచాలి

ఉప్పలగుప్తం: వేతనాలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని కోరుతూ అంగన్‌వాడీ సిబ్బంది స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రెవెన్యూ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీనువాస్‌కు అందించారు.

దిండి - చించినాడ వంతెన మరమ్మతులు వాయిదా

అమలాపురం రూరల్: గోదావరి నదికి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో 216 జాతీయ రహదారిలో దిండి –చించినాడ వంతెన బేరింగ్ రీప్లేస్‌మెంట్ మరమ్మతు పనుల కోసం అమలు చేసిన ట్రాఫిక్ నియంత్రణను సడలించారు. వంతెన మీదుగా రాకపోకలు రెండు రోజుల పాటు గురువారం, శుక్రవారం సడలిస్తున్నట్లు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. ఆ ప్రాంత ప్రజల పౌర జీవనానికి ఇబ్బంది కలగకుండా, వ్యాధిగ్రస్తులు, వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, గర్భిణులు దూర ప్రయాణాలను పరిగణనలో తీసుకొని వారి శ్రేయస్సు కోసం పనులు వాయిదా వేసినట్టు తెలిపారు. ఈ రెండు రోజుల్లో గోదావరి ఉధృతి కొంతవరకు తగ్గే అవకాశం ఉందని, 23 ,24 తేదీల్లో యథావిధిగా వంతెనపై పూర్తిగా రాకపోకలను నిలుపుదల చేసి మరమ్మతులు చేపట్టనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈనెల 23, 24 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిలుపుదల చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. 216 జాతీయ రహదారి వెంబడి పర్యటించే వాహనదారులు ఈ విషయాన్ని గమనించి అధికార యంత్రాంగానికి పూర్తిగా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

అల్లవరం: మోసుగంటి గంగయ్య మెమోరియల్ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్టు, రుద్రరాజు సీతాపతిరాజు చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో కొమరగిరిపట్నం ఉన్నత పాఠశాలలో నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ పోటీ పరీక్షకు సిద్ధమయ్యే 8వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను గురువారం అందించారు. పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు మోసుగంటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌ను విద్యార్థులందరూ స్టడీ మేటరియల్‌ను సద్వినియోగం ఉత్తమ ర్యాంకులు సాధించి, పాఠశాలలకు మంచి పేరు తీసుకుని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆకుల దుర్గ ప్రసాదు, వై.ప్రభాకర్, నరసింహమూర్తి, విజయకుమార్, సుబ్రహ్మణ్యం, ఏవీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

మంత్రి ప్రగడ సత్రం చైర్మన్‌గా పవన్ బాధ్యతల స్వీకరణ

అమలాపురం టౌన్: స్థానిక మంత్రి ప్రగడవారి సత్రం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా నియమితులైన గొర్తి పవన్ ఆ సత్రం కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల్ ప్రతిపక్ష నాయకుడు యేడిద శ్రీను, నాయకులు మహాదశ నాగేశ్వరరావు, పిండి రాజా, నల్లా చిట్టి, కల్వకొలను సతీష్, కొత్తూరి వంశీ, కె.రమేష్‌తో పాటు సత్రానికి చెందిన దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.